నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, ఆదివారం 2 మార్చి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


భార్య దాష్టీకానికి భర్త బలయ్యాడు. ప్రేమించి పెళ్లాడిన భార్యే బరితెగించి వివాహేతర బంధానికి అడ్డొస్తున్నాడని కట్టుకున్న భర్త చావును కళ్లజూసింది. సుపారీ ఇచ్చి మరీ ప్రియుడు, ఏఆర్ కానిస్టేబుల్‌తో హత్యకు స్కెచ్ వేసింది. గత నెల 20న భట్టుపల్లి శివారులో సుత్తితో తలపై విచక్షణారహితంగా దాడి చేయించగా తొమ్మిది రోజుల పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం అర్ధరాత్రి యువ వైద్యుడు సుమంత్‌రెడ్డి(37) తుది శ్వాస విడిచాడు. ఇప్పటికే నిందితులను పోలీసులు అరెస్టు చేయగా కఠినంగా శిక్షించాలని వైద్య సంఘాలు డిమాండ్ చేశాయి. - వరంగల్ చౌరస్తా/కాజీపేట, మార్చి 1

# బరితెగించి.. భర్తను చావగొట్టి!

భార్య దాష్టీకానికి యువ వైద్యుడు సుమంత్‌రెడ్డి బలి


వైద్యుడు సుమంత్‌రెడ్డి పార్థివ దేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, మిత్రులు

సుమంత్‌రెడ్డి (ఫైల్)

- ఎంజీఎంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- కాజీపేటలోని సొంత ఇంటికి మృతదేహం తరలింపు
- అంత్యక్రియలకు సంగారెడ్డికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు
- నిందితులను కఠినంగా శిక్షించాలని వైద్యసంఘాల డిమాండ్

ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ డాక్టర్ సు మంత్‌రెడ్డి శుక్రవారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భార్య ఫ్లోరా తన ప్రియుడు శామ్యూల్‌తో కలిసి ఏఆర్ కానిస్టేబుల్ రాజు సహాయంతో గత నెల 20న రాత్రి ఉర్సు గుట్ట నుంచి భట్టుపల్లికి వెళ్లే రోడ్డులో సుమంత్‌రెడ్డి కారును అడ్డగించి హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఇనుప రాడ్లతో దాడి చేయడంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావంతో అపస్మారకస్థితిలో పడివున్న అతడిని స్థానికులు గుర్తించి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సుమంత్‌రెడ్డి శరీరం చికిత్సకు స్పందించకపోవడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు గురువారం రాత్రి తిరిగి ఎంజీఎం ఆస్పత్రికి తీసుకురాగా శుక్రవారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. పంచనామా అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించగా కాజీపేట సిద్ధార్థనగర్‌లోని సొంత ఇంటికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న బంధువులు, మిత్రులు, స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున తరలివచ్చి పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. కాగా, సుమంత్‌రెడ్డి తల్లిదండ్రులు గాదె అసుంత మేరీ-సుధాకర్‌రెడ్డి 30 ఏళ్లుగా కాజీపేటలోని విష్ణుపురిలో నివాసం ఉండేవారు. ఏడేళ్లక్రితం సిద్ధార్థనగర్‌కు షిఫ్ట్ అయ్యారు. ప్రస్తుతం మృతుడు సుమంత్‌రెడ్డి భార్యతో కలిసి హనుమకొండ హంటర్ రోడ్డులో నివాసముంటూ విష్ణుపురిలో క్లినిక్ నడిపేవాడు. డాక్టర్, ఆయన కుటుంబం అందరితో కలుపుగోలుగా ఉండేవారని, ఎవరికీ హాని చేయరని ఆపద వస్తే ఆదుకునే కుటుంబమని అక్కడికి వచ్చిన వారు మాట్లాడుకోవడం కనిపించింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య ఇలాంటి ఘాతుకానికి పాల్పడడం దారుణమని, ఓ మంచి వైద్యుడిని కోల్పోయామంటూ చర్చించుకున్నారు. నిందితులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని పలు వైద్యుల సంఘాలు, అసోసియేషన్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. కాగా, సుమంత్‌రెడ్డి పార్థివదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులు సంగారెడ్డికి తీసుకెళ్లగా కాజీపేట నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు.


వరి పొలం ఎండిపోవడంతో దిగాలుగా కూర్చున్న రైతు గుత్తి రాములు

# కరువు కాలం రైతుకు కష్టకాలం!

ఎండిపోయిన బోరు బావి

ఏడాది క్రితం వరకు ఎటుచూసినా పచ్చని పొలాలతో కళకళలాడిన జనగామ ప్రాంతంలో ఇప్పుడు మళ్లీ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చాక అదునుకు గోదావరి జలాలు అందించి ఏండ్ల నాటి కరువును దూరం చేసింది. రైతన్న ఇంట సిరుల పంటలు పండగా వ్యవసాయాన్ని పండుగలా మారింది. అంతేగాక ఉపాధి కోసం దశాబ్దాల క్రితం వలసపోయిన ఎన్నో కుటుంబాలు సొంతూళ్లకు తిరిగిరావడంతో పదేళ్లలో జీవన చిత్రం సరికొత్తగా ఆవిష్కృతమైంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతులకు మళ్లీ కష్టకాలం దాపురించింది. నాడు ఎండాకాలంలోనూ మత్తళ్లు దూకిన చెరువులు, కుంటలు ప్రస్తుతం వట్టిపోవడం.. భూగర్భ జలాలు అంతకంతకూ పడిపోతుండడంతో ఎండిన వరి పొలాలు పశువులను మేపాల్సిన దుస్థితి వచ్చింది. అటు నీట జాడ లేక మడులకు తడి అందక కండ్ల ముందే పచ్చని పంట ఎండిపోతుండడంతో రైతన్న కలవరపెడుతున్నది.

- జనగామ, మార్చి 1 (నమస్తే తెలంగాణ)

## బీఆర్ఎస్ పాలనలో పచ్చని పొలాలతో కళకళ

- నేడు భూగర్భ జలాలు అడుగంటి ఎండిపోతున్న పొలాలు
- జిల్లాలో 7.15 మీటర్ల లోతుకు పడిపోయిన నీటి జాడలు
- వట్టిపోతున్న చెరువులు, కుంటలు
- ఎండుతున్న యాసంగి సీజన్ పంటలు
- పశువులకు మేతగా ఎండిన వరి చేన్లు


ఎండిపోయిన వరి పొలంలో ఆవులను మేపుతున్న రైతు

## జనగామలో పదేళ్ల తర్వాత మళ్లీ మొదలైన సాగు కష్టాలు

జిల్లాలో భూగర్భ జలాల నీటి మట్టం (మీటర్లలో)

| మండలం | జనవరి-25 | ఫిబ్రవరి-25 |
|---|---|---|
| స్టేషన్‌ఘన్‌పూర్ | 11.01 | 11.65 |
| జఫర్‌గడ్ | 12.51 | 11.59 |
| నర్మెట | 7.73 | 10.31 |
| బచ్చన్నపేట | 4.57 | 6.02 |
| చిల్పూరు | 6.8 | 8.01 |
| దేవరుప్పుల | 1.36 | 3.53 |
| జనగామ | 3.39 | 4.04 |
| కొడకండ్ల | 6.95 | 9.91 |
| లింగాలఘనపురం | 4.49 | 6.61 |
| రఘునాథపల్లి | 9.95 | 10.31 |
| తరిగొప్పుల | 5.35 | 8.08 |
| పాలకుర్తి | 2.06 | 3.31 |

జిల్లాలో యాసంగి సీజన్‌లో మొత్తం 1.99 లక్షల ఎకరాల్లో వరి, మక్కజొన్న వంటి వివిధ పంటలు సాగు చేస్తారనే అంచనా వేయగా 1.72 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు వేశారు. అందులో 1.60 ఎకరాల్లో వరి పంట వేశారు. ఇప్పటికే సాగు నీటి కటకటతో పలుచోట్ల 30శాతం పంటలు ఎండిపోగా మరి కొద్దిరోజులు పరిస్థితి ఇలాగే ఉంటే రైతులు దారుణంగా నష్టపోవాల్సి వస్తుంది. ఉమ్మడి జిల్లాలో కరువుకు చిరునామాగా సముద్ర మట్టానికి 550 మీటర్ల ఎత్తైన డ్రాట్ ఏరియాగా ముద్రపడి బోర్లు వేసేందుకు, ఇసుక తీయటానికి వీళ్లేదని నిషేధాజ్ఞలకు గురైన అతి దుర్భిక్షాన్ని ఎదుర్కొన్న జనగామ ప్రాంతం కేసీఆర్ సర్కారు ఏర్పడిన తర్వాత దేవాదుల ద్వారా అందిన సాగునీటితో రికార్డు స్థాయిలో పండిన ధాన్యంతో పచ్చని కోనసీమ అయ్యింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జనగామ జిల్లాకు దేవాదుల నీటి పంపింగ్ ఆగిపోవడంతో జిల్లాలోని 7 రిజర్వాయర్లకు గానూ నర్మెట మండలం బొమ్మకూరు, లింగాలఘనపురం మండలం నవాబుపేట, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఆర్ఎస్ ఘన్‌పూర్, రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. వర్షపాతం తక్కువగా ఉండే జనగామ ప్రాంతంలో తెలంగాణ వచ్చిన తర్వాత దేవాదుల ప్రాజెక్టు నుంచి ఆయా రిజర్వాయర్లకు గోదావరి నీటిని పంపింగ్ చేసి కాలువల ద్వారా చెరువులు, కుంటలు, ఇతర చిన్ననీటి వనరులు నింపిడం వల్ల ఎండాకాలంలోనూ నిండుగా మారి భూగర్భజలాలు సంవృద్ధిగా ఉండేవి.

జిల్లాలోని 12 మండలాల పరిధిలో 953 చెరువులు, కుంటల పరిధిలో 68,962 ఎకరాల ఆయకట్టు ఉంటే వాటిలో 336 వనరుల్లో నీటి మట్టాలు 25 శాతానికి పడిపోయాయి. మరో 313 నీటి వనరుల్లో 25 నుంచి 50శాతంకు ఇంకో 183 నీటి వనరుల్లో 50 నుంచి 75 శాతం, 121 వనరుల్లో 75 నుంచి 100శాతం నీటి నిల్వలు పడిపోయాయి. జిల్లాలో కేవలం 400 చెరువుల్లో మాత్రమే ప్రస్తుతం నీటి జాడలు కనిపిస్తున్నాయి. గతంలో 90 శాతంకు పైగా గ్రామాలలో నీటి వనరులన్నీ దేవాదుల నీటితో నింపి పంటలకు సాగునీరందడం సహా భూగర్భ జల నీటి మట్టం పెరిగి బోర్లు వేసినా..బావులు తవ్వినా 80 నుంచి 100 ఫీట్ల లోపు నీటి జాడలు ఉబికివచ్చేవి. ప్రస్తుత యాసంగి సీజన్‌లో దేవాదుల నీటిని విడుదల చేయకపోవడంతో చెరువులు, కాల్వలు ఎండిపోయి బోరు బావులు ఒట్టిపోయి వరి, మక్కజొన్న వంటి పంటలు ఎండిపోతున్నాయి. జిల్లాలోని గండిరామారం, బొమ్మకూరు, చీటకోడూరు, నవాబుపేట, ఆర్ఎస్ ఘన్‌పూర అశ్వరావుపల్లి రిజర్వాయర్లు సీజన్‌కు ముందు సాకాలంలో నింపి వాటి ద్వారా చెరువులు, కుంటలకు నీటిని విడుదల చేయడంలో అధికార ప్రభుత్వం విఫలమైంది. అదనులో పంటలకు సరిపడా తడులు అందిస్తే భూగర్భజలాలు సైతం లోతుకు పడిపోకుండా నిలకడగా ఉండేవని రైతులు చెబుతున్నారు. 2024 జనవరిలో 6.91 మీటర్ల లోతులో నీరుంటే..2025 జనవరి నాటికి (ఏడాది తర్వాత) 7.15 కిందకు పడిపోయి జిల్లాలో భూగర్భజలాలు అధికారికంగా 0.79గా నమోదై కరువు ఛాయలు సూచిస్తున్నాయి. జనగామ, బచ్చన్నపేట, రఘునాథపల్లి, లింగాలఘనపురం, నర్మెట, చిల్పూరు, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్ మండలాల్లో ఇప్పటికే వరి ఎండిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏనాడూ సాగునీటి కటకట ఎరుగని రైతులు ఈసారి పెట్టుబడుల దక్కే పరిస్థితి లేకపోగా తమ కళ్ల ముందే పచ్చటి పంటలను పశువుల మేతకు కోసి వేయాల్సిన దుస్థితి నెలకొనడం కంట నీరు తెప్పిస్తున్నది. ఒకనాడు కరువు, దుర్భిక్షానికి కేరాఫ్‌గా ఉండే జనగామ ప్రాంతం కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవాదుల నీటి ద్వారా కరువును జయించి అంచనాలకు మించి వరి సాగై ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే రికార్డు స్థాయిలో ధాన్యం పండింది. కేవలం రెండు నెలల వ్యవధిలోనే జిల్లాలో నీటి మట్టాలు దారుణంగా పడిపోయి మళ్లీ కరువుకాలం ముంచుకు వస్తుండటం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. దేవాదుల ద్వారా రిజర్వాయర్లు నింపి అక్కడి నుంచి గ్రామాల్లో చెరువులు, కుంటలకు నీటిని తరలిస్తే తప్ప యాసంగి సీజన్ గట్టెక్కే పరిస్థితి కనిపిస్తున్నది.


నీరు లేక వెలవెలబోతున్న నవాబ్ పేట రిజర్వాయర్

రిజర్వాయర్లలో నీటి మట్టం వివరాలు (క్యూబిక్ మీటర్లలో)

| రిజర్వాయర్ | కేపాసిటీ | ప్రస్తుత నీటి మట్టం | శాతం |
|---|---|---|---|
| అశ్వరావుపల్లి | 0.740 | 0.270 | 36.49 |
| నవాబుపేట | 0.550 | 149.530 | 27.16 |
| చీటాకోడూరు | 0.300 | 215.072 | 71.63 |
| బొమ్మాకూరు | 0.198 | 89.310 | 45.11 |
| గండిరామారం | 0.400 | 260.264 | 65.07 |
| ఆర్ఎస్ ఘన్‌పూర్ | 0.1570 | 636 | 40.51 |


- నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడిన మాజీ మంత్రి
- గోదావరి జలాలు విడుదల చేసిన అధికారులు

పాలకుర్తి మండలం ఈరవెన్ను వద్ద దేవాదుల-4ఎల్ ద్వారా విడుదలై కాల్వలో పారుతున్న గోదావరి జలాలు

# ఫలించిన ఎర్రబెల్లి కృషి

పాలకుర్తి, మార్చి 1 : పాలకుర్తి నియోజకవర్గంలో వరి పొలాలు రైతుల కళ్ల ముందే ఎండిపోతుండడం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తట్టుకొలేకపోయారు. పొలాలు బీటలుగా వారుతుంటే చలించిపోయారు. తాను అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రైతులు, ప్రజల పక్షమేనని మరోసారి నిరూపించారు. భూగర్భ జలాలు లేక పాలకుర్తి, దేవరుప్పుల మండలాల్లో ఎండిపోతున్న వరి పొలాలను ఆయన స్వయంగా పరిశీలించారు. వెంటనే సాగునీరు విడుదల చేయాలని దేవాదుల సీఈ, ఎస్ఈ, ఈఈలతో పాటు ఇతర అధికారులతో ఫోన్‌లో పలుమార్లు మాట్లాడారు. శాతాపురంతో పాటు దేవరుప్పుల మండలంలోని పలు తండాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పర్యటించిన ఆయన.. వెంటనే నీళ్లు వదలకపోతే రైతులతో కలిసి ధర్నా చేస్తానని హెచ్చరించారు. ఈమేరకు అధికారులు శనివారం దేవాదుల-4ఎల్ ద్వారా గోదావరి జలాలను విడుదల చేశారు. రైతుల బాధలను చూసి గోదావరి జలాలను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, దేవాదుల నీటి పారుదల శాఖ అధికారులకు ఎర్రబెల్లి ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్నికల కోడ్‌ను కాదని..

- ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ కోసం అధికార పార్టీల హంగామా
- బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట


ఒకే టెంట్ కింద కార్యక్రమాలు చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నేతలు

కరీమాబాద్, మార్చి 1 : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను కాదని.. మామునూరు ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ కోసం అధికార బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు పోటీపడ్డారు. ఈ ఘటన తమదంటే తమదేనంటూ వారి నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు, పుష్పాభిషేకాలు చేయగా స్థానికంగా ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అయితే సామాన్యులు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే హడావుడి చేసే పోలీసులు అధికార పార్టీల నాయకుల విషయంలో మాత్రం ఏమీ పట్టనట్లుగా వ్యహరించారు. వివరాల్లోకి వెళితే మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో శనివారం మామునూరు ఎయిర్‌పోర్టు గేటు వద్ద బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం నిర్వహించి సంబురాలను చేపట్టారు. దీంతో తామేం తక్కువ అన్నట్లుగా కాంగ్రెస్ నాయకులు సైతం సంబురాలు చేసుకునేందుకు అక్కడకు చేరుకున్నారు. పోటాపోటీగా నినాదాలు చేస్తూ ఇరు పార్టీల నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను సముదాయించారు. అనంతరం ఒకే టెంట్ కింద రెండు పార్టీల నాయకులు పుష్ప, క్షీరాభిషేకాలునిర్వహించారు. కాగా, ఈ రెండు పార్టీల హంగామాను చూసి స్థానికులు మండిపడ్డారు. ఎయిర్‌పోర్టు మూతపడిన నాటి నుంచి కేంద్రంలో ఉన్నది బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలే అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణ వచ్చాకే మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంలో కదలిక వచ్చిందంటున్నారు. కాగా, ఎన్నికల కోడ్ ఉన్నా.. వరంగల్ కొత్తవాడలోని కొండా లక్ష్మణ్ బాపూజీ జంక్షన్ వద్ద శనివారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి కొండా సురేఖ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

# కాల్వల ఆక్రమణలు తొలగిస్తాం

- గ్రానైట్ ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకుంటాం
- నీటిపారుదల శాఖ ఏఈ అరవింద్

నమస్తే ఎఫెక్ట్

హనుమకొండ సబర్బన్, మార్చి 1 : దేవాదుల ఉత్తర కాల్వ పరిధిలోని పిల్ల కాల్వల ఆక్రమణను సహించేది లేదని నీటిపారుదల (దేవాదుల) శాఖ ఏఈ అరవింద్ తెలిపారు. శనివారం 'నమస్తే తెలంగాణ'లో 'దేవా.. దిక్కెవరు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కాల్వలు అన్యాక్రాంతమైనట్లు ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని, అన్నింటిని త్వరలోనే పరిశీలించి వాటి ఆక్రమణలకు పాల్పడిన గ్రానైట్ ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దీని కోసం శాటిలైట్ చిత్రాలను పరిశీలిస్తామన్నారు. అలాగే డిస్ట్రిబ్యూటరీ 7కు గేట్ బిగించే విషయంలో రైతులను సిబ్బంది డబ్బులు అడిగిన విషయం కూడా తమ దృష్టికి రాలేదని, విచారణలో నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. నీటి సరఫరా విషయంలో సమస్యలుంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చివరి ఆయకట్టు వరకు నీటిని అందించక పోవడం నిజమేనని, దీనికి మొదట ఉన్న రైతులు అనుమతులు లేకుండా కాల్వల్లో మోటర్లు బిగించి పంటలకు నీరు తరలించడమే కారణమని అరవింద్ స్పష్టం చేశారు.



నిట్‌లోని 'స్ప్రింగ్ స్ప్రీ' బోర్డు వద్ద సెల్ఫీ దిగుతున్న విద్యార్థినులు


'స్ప్రింగ్ స్ప్రీ'లో సందడి చేసిన 'మ్యాడ్-2' చిత్రబృందం

# వసంతోత్సాహం..



- నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ జోష్
- ఆకట్టుకున్న ఈవెంట్లు, అలరించిన ప్రదర్శనలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 1 : వరంగల్ నిట్‌లో వార్షిక సాంస్కృతిక వేడుక విద్యార్థుల్లో నూతనోత్సాహం తీసుకొచ్చింది. స్ప్రింగ్ స్ప్రీ రెండో రోజు వివిధ సాంస్కృతిక, సృజనాత్మక కలగలపి నిర్వహించిన 18 ప్రత్యేక ఈవెంట్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా హ్యాండ్ ప్రింటింగ్ (వాల్యూ ఎడ్యుకేషన్ క్లబ్ అండ్ ఎన్ఎస్ఎస్)- విద్యార్థులు తమ చేతిముద్రలను చక్కగా వేయడం ద్వారా జ్ఞాపకాలుగా నిలిపే కార్యక్రమాన్ని నిర్వహించారు. కుండల తయారీ(పాటరీ) (ఎన్ఎస్ఎస్)-మట్టితో చేతిపనికి ఒక అనుభూతిని అందించే కార్యక్రమం, స్నేక్స్ అండ్ లాడర్స్(యూత్ రెడ్ క్రాస్)-చిన్న పిల్లల ఆటను నిజజీవిత అనుభూతితో వినూత్నంగా నిర్వహించారు. యన్‌సాల్వ్‌డ్ (లిటరరీ అండ్ డిబేట్ క్లబ్) నిఘా, విచారణ ఆధారంగా నడిచే డిటెక్టివ్ గేమ్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ(ఫొటోగ్రఫీ క్లబ్)- సాంస్కృతిక అంశాలను 15 నిమిషాల్లో ఫొటోరూపంలో అందించే పోటీలు కట్టిపడేశాయి. పోలరాయిడ్ ఫొటోగ్రఫీ(ఫొటోగ్రఫీ క్లబ్)-వెంటనే తక్షణ ఫొటోలను తీసుకొని గుర్తుగా ఉంచుకునే ప్రత్యేక అనుభవం, ఆర్ట్ థెరపీ (పెయింటింగ్ క్లబ్)-చిత్రలేఖనం ద్వారా భావాలను వ్యక్తీకరించే చికిత్సాత్మక కార్యక్రమం, తానాబానా (ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్)- సంప్రదాయ ఆహారాలు, వస్త్ర ధారణ, పద్ధతులపై అవగాహన పెంచే ఆట ఏర్పాటు చేశారు. ట్రెజర్ హంట్(లిటరరీ అండ్ డిబేట్ క్లబ్)-సాంస్కృతిక విషయాలపై ఆధారపడి స్కావెంజర్ హంట్ పోటీ నిర్వహించి ఆకట్టుకున్నారు.

## మూడో రోజు

చివరి రోజైన ఆదివారం అల్ల్యూర్-ఆకర్షణీయమైన ఫ్యాషన్ షో, డీజే నైట్ ఉంటుంది. నుక్కడ్ నాటక్( వీధి నాటిక ప్రదర్శన), అరోహన్-జూలియస్, సీజర్ కథపై నాటక ప్రదర్శన, మైథాలజీ క్విజ్-పురాణ గాథలపై పరీక్షించే ప్రశ్నా పోటీ, బ్లిట్జ్ బుల్లెట్ -చెస్ పోటీ నిర్వహించనున్నారు.


సింగర్ గీతామాధురి పాటకు కేరింతలు కొడుతున్న విద్యార్థులు

## అలరించిన ప్రో షోలు..

నిట్ గ్రౌండ్‌లో ప్రోషోలు అందరినీ అలరించాయి. ఈ ఉత్సవ ప్రత్యేక ఆకర్షణగా తెలుగు సినిమా మ్యాడ్ స్క్వేర్ చిత్రబృందం నిట్ క్యాంపస్‌ను సందర్శించి విద్యార్థులతో ఉత్సాహభరితంగా మాట్లాడారు. అనంతరం ప్రముఖ నేపథ్యగాయని గీతామాధురి తన మధుర గానంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఇక రాత్రిని మ రింత రసవత్తరంగా మార్చిన కొరియో నైట్ పోటీ, వివిధ నృత్యబృందాల అద్భుత ప్రదర్శనలతో కొనసాగింది.




